## క్లుప్తంగా

### సంస్కరణలతో నాణ్యమైన విద్య

**ట్యాబ్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కన్నబాబు**



విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

**కాకినాడ రూరల్:** విద్యారంగంలో సంస్కరణలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ ఒకటో డివిజన్ రమణయ్యపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ జగనన్న విద్యా కానుకలో భాగంగా డిజిటల్ విద్యను అందించేందుకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఒకటో డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వాసురెడ్డి సూరిబాబు, జేఎన్‌టీయూకే వీసీ మెంబరు బెజవాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

**కాకినాడ:** కేంద్ర పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం కాకినాడలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. స్థానిక రేచర్లపేట సచివాలయం, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కేంద్ర పథకాలను ప్రజలకు వివరించారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు అందుబాటులో ఉన్న కేంద్ర పథకాలను వివరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వై.మాలకొండయ్య, నాయకులు ముత్తా నవీన్, రంబాల వెంకటేశ్వరరావు, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, ఏడిద కృష్ణ, కె.గంగాధర్ పాల్గొన్నారు.

### పేద విద్యార్థుల చదువుకు విరాళం



సతీష్‌కు చెక్కు అందిస్తున్న ఈశ్వర్‌దత్తు

**కాకినాడ క్రైం:** పేద విద్యార్థుల చదువు కోసం ఓ సెల్‌ఫోన్ వ్యాపారి తనవంతు బాధ్యతగా ముందుకు వచ్చారు. పిఠాపురానికి చెందిన ఆరుద్ర మొబైల్స్ అధినేత పైండా ఈశ్వర్‌దత్తు శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థకు బుధవారం రూ.లక్ష విరాళం అందించారు. కోవిడ్‌తో మృతి చెందిన కుటుంబాల విద్యార్థుల చదువు బాధ్యతలు తీసుకున్న శ్రీయువసేన వ్యవస్థాపకుడు సతీష్‌ను ఈ సందర్భంగా అభినందించారు.

### ఘనంగా జాతీయ గీతం ఆమోద దినోత్సవం

**కాకినాడ రూరల్:** బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో బుధవారం జాతీయ గీతం జనగణమన ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గీత రచయిత, నోబుల్ అవార్డు గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్‌కు వాకర్స్ జిల్లా కౌన్సిలర్ అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాఘవరావు తదితరులు ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 1950 జనవరి 24న జనగణమనను రాజ్యాంగ సభ జాతీయ గీతంగా స్వీకరించి, ఆమోదించిందన్నారు.

### తాడేపల్లిగూడెంలో బీసీ సదస్సు

**కాకినాడ సిటీ:** బీసీ హక్కుల సాధనకై ఫిబ్రవరి 11న తాడేపల్లిగూడెం పెద్ద తాడేపల్లిలో జరిగే బీసీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ చొల్లంగి వేణుగోపాలరావు, బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, 93 బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మాకిరెడ్డి భాస్కరగణేష్‌బాబు కోరారు. బుధవారం కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జనగణనలో సమగ్ర కుల గణన జరగాలని, మహిళా రిజర్వేషన్ బిల్లు, బీసీ సబ్‌ప్లాన్, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఏర్పాటు చేయాలని, ఏబీసీడీ వర్గీకరణ, బీసీలకు క్రిమిలేయర్, బీసీ అట్రాసిటీ యాక్ట్ తదితర అంశాలపై పోరాటానికి బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు మల్లుల విజయ్, తామరపల్లి దుర్గాప్రసాద్, అరటికట్ల త్యాగరాజ ఆచార్య, కట్టా శ్రీనివాస్, దొమ్మేటి శ్రీనివాస్, కర్రి గోపాలకృష్ణ, రాయుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలి

**కాకినాడ సిటీ:** కాకినాడ బాలాజీ చెరువు సమీపంలో ఉన్న అంబేడ్కర్ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించి, విద్యార్థులు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని పలువురు దళిత నాయకులు కోరారు. నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, పిల్లి రామారావు, డి నీలకంఠం తదితరులు కలెక్టర్ కృతికా శుక్లాను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

# జీవితాల్లో కానుక వెలుగులు

- మెరుగుపడిన పేదలు, వృద్ధులు, దివ్యాంగుల బతుకులు
- పింఛను ఇచ్చి కొడుకులా.. అన్నలా ఆదుకున్నారని ఆనందం
- ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటామంటున్న లబ్ధిదారులు
- కష్టాల నుంచి గట్టెక్కించిన వైఎస్సార్ పింఛను పథకం



కరపలో లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలిసి కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు(ఫైల్)

**కరప:** ఒకానొక సమయంలో.. ఎండకు ఎండి.. వానలో తడిసి.. కడుపు మండినా ఆకలికోర్చి.. గంటల తరబడి నిరీక్షిస్తే.. చివరకు చేతికొచ్చేది గుప్పెడు పైసలే. వృద్ధాప్యపు మసకబారిన కళ్లతో దీనంగా చూసే చూపులకు కూడా గత పాలకుల కరకు గుండెలు కరగలేదు. జీవనాధారం కోల్పోయి.. దిక్కుతోచని స్థితిలో ఉన్న అక్కచెల్లెమ్మలకు ఏదో ఆసరా ఇవ్వాలన్న ఆలోచన అంతకన్నా లేదు. ఇటువంటి గడ్డు పరిస్థితుల నుంచి.. నేనున్నానంటూ భరోసా ఇచ్చి ఆదుకున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మంజూరు చేసిన పింఛను అంతకంతకూ పెంచుకుంటూపోయి.. ఇప్పటికీ రూ.మూడు వేలు చేసి.. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు.. దివ్యాంగులు.. ఇలా అందరి మోముపై చెరగని చిరునవ్వును నిలిపారు. ఏ ఆధారమూలేని పేదల జీవితాల్లో వైఎస్సార్ పింఛను కానుక వెలుగులు నింపుతోంది. పస్తులతో బతుకే తమలాంటి వారికి.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెలవారీ పింఛనుతో కడుపు నింపుకొంటున్నామని వృద్ధులు, మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పింఛనుదారులకు ప్రతినెలా ఒకటో తేదీనే తలుపుతట్టి ఠంచనుగా పింఛను చేతికిస్తున్నారని అంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేసినా మంజూరు కాని పింఛనును.. ఇప్పుడు వలంటీర్లు ఇంటికివచ్చి మరీ.. నీకు పింఛను వస్తుందా లేదా అని అడిగి, దరఖాస్తు చేయించి, మంజూరు చేయిస్తున్నారని గ్రామీణ ప్రాంతాల పేదల ఆనందానికి అవధుల్లేవు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లు ఎలా తగ్గించాలా అని ఆలోచించేవారని, అది కూడా అర్హత ఉన్నా, ఆ పార్టీ నాయకుల సిఫార్సు చేస్తేనే పింఛను దక్కేదంటున్నారు. ఆ కొద్దిపాటి పింఛను కోసం పచ్చచొక్కా నేతల చుట్టూ, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని టీడీపీ హయాంలో తమకు ఎదురైన చేదు అనుభవాలను, పడ్డ బాధలను వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు గుర్తుచేసుకుంటున్నారు. భర్త మరణించాడు, పింఛను ఇచ్చి ఆదుకోండని వేడుకున్నా పింఛను మంజూరు చేసేవారు కాదని, జగనన్న వచ్చాక వలంటీర్లే ఇంటికి వచ్చి దరఖాస్తు తీసుకుని పింఛను మంజూరు చేయించారంటున్నారు.

**పడిగాపుల నుంచి విముక్తి**

సదరం సర్టిఫికెట్లు ఉన్నా, మళ్లీ పరీక్ష చేయించుకురమ్మని పంపించేవారని టీడీపీ ప్రభుత్వంలో పడిన బాధలను దివ్యాంగులు తెలిపారు. మంజూరైన పింఛను తీసుకోవాలంటే పింఛనుదారులు పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. కరెంట్ లేదని, సిగ్నల్స్ లేవని, సర్వర్ డౌన్ అంటూ గంటల తరబడి కూర్చోపెట్టి, చివరకు టైం అయిపోయిందంటూ పంపించేసేవారు. ఇలా ప్రతినెలా రెండు, మూడు రోజులు తిరిగితే కానీ, పింఛను చేతికొచ్చేది కాదని వృద్ధులు అనుభవించిన బాధలు చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుణ్యమా అని వలంటీర్లు ఇంటికే పింఛను సొమ్ము తీసుకొచ్చి చేతిలో పెడుతుంటే.. పెద్ద కొడుకు రూపంలో వచ్చాడనిపిస్తోందని పింఛనుదారులు ఉద్వేగానికి లోనవుతున్నారు.

**పింఛన్ల పంపిణీ ఇలా..**

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఈ ఏడాది మొత్తం 714 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. వీటితో కలిపి వివిధ రకాల మొత్తం 30,376 పింఛన్లను ప్రభుత్వం ప్రతినెలా పంపిణీ చేస్తోంది. కాకినాడ రూరల్ మండలంలో కొత్త పింఛన్లు 322 ఉండగా, మొత్తం 18,587 పింఛన్లు ఇస్తున్నారు. అలాగే కరప మండలంలో కొత్త పింఛన్లు 392 మంజూరవ్వగా, మొత్తం 11,789 మందికి పంపిణీ చేస్తున్నారు.

**మండలంలో 11,575 మందికి పింఛన్లు**



ఈ ఏడాది కొత్తగా 392 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. వీటిలో వృద్ధాప్య, చేనేత, మత్స్యకార, ఒంటరి మహిళ, వితంతు, దివ్యాంగులు, డప్పు కళాకారులు, కల్లుగీత కార్మికులు తదితర కొత్త పింఛన్లు ఉన్నాయి. వీటితో కలిపి మండలంలో వైఎస్సార్ పింఛను కానుక పథకంలో 11,789 మందికి వివిధ రకాల పింఛన్ల రూపంలో రూ.3,46,61,000 అందజేస్తున్నాం.

– కె.అప్పారావు, ఎంపీడీఓ, కరప

**పింఛను ఇచ్చి ఆదుకున్నారు**



భర్త చనిపోవడంతో ఆధారం కోల్పోయాను. గ్రామ వలంటీర్ ఇంటికి వచ్చి, సంతకం చేయించుకుని, పింఛనుకు దరఖాస్తు చేయించారు. జనవరిలో కొత్తగా పింఛను మంజూరైందని ఇంటికి డబ్బు తెచ్చి చేతిలో పెట్టారు. పింఛనుతో ఆదుకున్న ముఖ్యమంత్రి జగన్ మేలు ఎప్పటికీ మరువలేను. ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగాలి.

– పులపకూర గంగాభవాని, పెనుగుదురు

**జగనన్నకు రుణపడి ఉంటా**



దివ్యాంగ పింఛను కోసం చాలాకాలం ప్రయత్నించాను. గ్రామ వలంటీర్, స్థానిక నాయకులు సదరం సర్టిఫికెట్ తీసుకోమన్నారు. సర్టిఫికెట్ వచ్చాక వలంటీర్ మంగాదేవి పీహెచ్ పింఛను కోసం దరఖాస్తు చేయించారు. తర్వాత కొత్త పింఛను మంజూరైందంటూ ఇంటికి వచ్చి, డబ్బులు ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటా.

– పరస ధనలక్ష్మి, దివ్యాంగురాలు, వేములవాడ

### అంధులకు విలువైన కళ్లజోళ్ల పంపిణీ



అంధులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కాకినాడ రూరల్:** బెంగళూరు కేంద్రంగా బ్రెయిలీ భాష ఆధారిత కృత్రిమ మేధతో పనిచేసే విలువైన కళ్లజోళ్లను బీపీసీఎల్ వారి నిధులతో చెన్నై తూర్పు రోటరీ క్లబ్ దృష్టి కార్యక్రమంలో భాగంగా అందజేశారు. రూ.8.5 లక్షల విలువైన 27 కళ్లజోళ్లను రెడ్‌క్రాస్ అంధ బాలబాలికల పాఠశాల పూర్వ విద్యార్థులు 27 మందికి పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అందించారు. భారత్ పెట్రోలియం ప్రతినిధులు సంజీవ్‌కుమార్, చెన్నై రోటరీ క్లబ్ దృష్టి కార్యక్రమ నిర్వాహకులు రమణ్‌కుమార్ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ ఆధారంగా ఈ కళ్లజోళ్లు ధరించడం వల్ల ఎదుటి మనుషులను, వస్తువులను గుర్తించడానికి, పుస్తకాలు చదవడానికి, ప్రయాణించడానికి అనేక సదుపాయాలు పొందగలరని వివరించారు. ఎస్‌హెచ్‌జీ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు ఇబ్రహీం, విజయ్ ఈ కళ్లజోళ్ల వాడకంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, కాకినాడ రోటరీ క్లబ్ గోల్డెన్ జూబ్లీ అధ్యక్షులు ఎన్.రవికృష్ణ, సభ్యులు ముత్తా నవీన్, జీకే శ్రీనివాస్, ఉదయభాను, ప్రసాద్ రెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సమాజ అభివృద్ధికి విద్యే కీలకం

**కాకినాడ రూరల్:** సమాజాభివృద్ధికి విద్యే కీలకమని విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు.

## 27 నుంచి వైఎస్సార్ ఆసరా సంబరాలు

- 12 చోట్ల నిర్వహణకు ఏర్పాట్లు
- 3,700 గ్రూపులకు రూ.26 కోట్ల లబ్ధి
- కార్పొరేషన్ కమిషనర్ నాగనరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

**కాకినాడ:** కాకినాడలో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. స్థానిక స్మార్ట్ సిటీ సమావేశ మందిరంలో వైఎస్సార్ ఆసరా పంపిణీ ప్రక్రియపై సీఓలు, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఇదే అంశంపై నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడ నగరంలోని 12 వేర్వేరు ప్రాంతాల్లో ఐదు రోజుల పాటు వైఎస్సార్ ఆసరా సంబరాలు జరుగుతాయన్నారు. ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. కాకినాడ సిటీ పరిధిలో సుమారు 3,700 గ్రూపులకు సంబంధించి 38 వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆసరా పథకం ద్వారా లబ్ధి పొందుతారని చెప్పారు. వీరికి రూ 26 కోట్ల లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఆయా ప్రాంతాల్లో జరిగే ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి లబ్ధిదారులంతా తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ఆర్పీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సమావేశంలో మెప్మా పీడీ ప్రియంవద, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్ పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న ఈశ్వరన్ కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న విఘ్నేశ్ ఈశ్వరన్

**బోట్‌క్లబ్:** సంగీత విద్వత్సభ సంక్రాంతి సంగీత నృత్యోత్సవాల్లో భాగంగా బుధవారం సూర్యకళా మందిరంలో చెన్నైకి చెందిన విఘ్నేశ్ ఈశ్వరన్ గాత్ర కచేరి ఆద్యంతం ఆకట్టుకుంది. అఠాణ రాగంలో బాల కనకమయతో ప్రారంభించి, శంకరి, శంకురు, చంద్రముఖి మొదలైన కీర్తనలు చక్కగా గానం చేశారు. వీరికి వయోలిన్‌పై వీఎస్పీ గాయత్రీ శివాని, మృదంగంపై బుర్రా శ్రీరాం, ఘటంపై ఎస్.హనుమంతరావు చక్కటి సహకారాన్ని అందించారు. సరస్వతుల హనుమంతరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. నగర ప్రముఖులు కాశీవిశ్వనాథ్, వైడీ రామారావు, ద్విభాష్యం నగేశ్‌బాబు, వక్కలంక రామకృష్ణ పాల్గొన్నారు.

## పేదలు, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



పెద్దాపురప్పాడులో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

**కరప:** ప్రతి కుటుంబానికి ఆర్థిక చేయూతనిచ్చి, పేదల, రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దాపురప్పాడు గ్రామంలో ఆయన పార్టీ శ్రేణులు, అధికారులతో కల్సి ఇంటింటికీ తిరిగి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఏడెనిమిది పథకాల ద్వారా లబ్ధి పొందామని చెబుతుంటే గర్వంగా ఉందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా నవరత్న పథకాలు అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రామంలో కొన్నిచోట్ల రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని గ్రామస్తులు కోరగా, అందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రూ.66 లక్షలతో నిర్మించే మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే కన్నబాబు భూమిపూజ చేశారు. తర్వాత రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటనే అందించాలన్న సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, కాదా వెంకటేశ్వరరావు, నల్లా బాలాజీ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

- పైపులైన్ మరమ్మతులను పరిశీలించిన కమిషనర్



ధ్వంసమైన పైపులైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

**కాకినాడ:** సామర్లకోట కెనాల్ నుంచి శశికాంత్ నగర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు ముడినీటిని సరఫరా చేసే పైపులైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. అచ్చంపేట సమీపంలోని ఉండూరు వద్ద పైపులైన్ ధ్వంసం కావడంతో రెండు రోజులుగా కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో కమిషనర్ అధికారులతో కలిసి అక్కడ జరుగుతున్న మరమ్మతులను బుధవారం పర్యవేక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ పైపులైన్ ధ్వంసం కావడం వల్ల శశికాంత్ నగర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పరిధిలోని సుమారు ఎనిమిది డివిజన్లలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. రమణయ్యపేట, బొందగుంట, కొండేలుపేట, డి-మార్ట్, దుమ్ములపేట, పర్లోపేట, రాజీవ్ గృహకల్ప వంటి ప్రాంతాలకు మంచినీటి సరఫరాలో సమస్య తలెత్తిందన్నారు. ఆయా డివిజన్ల ప్రజలు మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా ఆరు మంచినీటి ట్యాంకర్లతో పాటు, మరో ఆరు అదనపు ట్యాంకర్లను కూడా సమకూర్చి మంచినీటిని సరఫరా చేస్తున్నామన్నారు. పైపులైన్ మరమ్మతులు వేగవంతం చేసి, సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గురువారం ఉదయం నుంచి శశికాంత్‌నగర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పరిధిలోని ప్రజలకు ఎప్పటిలా మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల ప్రగతిని ఎస్ఈ పి.సత్యకుమారి కమిషనర్‌కు వివరించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ ఈఈ మాధవి, ఏఈ రమేష్, వాటర్ వర్క్స్ సిబ్బంది ఉన్నారు.

### యూనియన్ బ్యాంకులో ఆకర్షణీయ పథకాలు



సదస్సులో మాట్లాడుతున్న సంతోష్ ప్రభు

**కాకినాడ సిటీ:** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు యూనియన్ బ్యాంకు వివిధ రకాల ఆకర్షణీయమైన పథకాలను అమలు చేస్తోందని ఆ బ్యాంకు విశాఖపట్నం జోన్ డిప్యూటీ జోనల్ హెడ్ సంతోష్ ప్రభు అన్నారు. బుధవారం కాకినాడ తిలక్ వీధి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సమావేశం కాకినాడ రీజనల్ హెడ్ సాయి మనోహర్ కాకి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ ప్రభు మాట్లాడుతూ ఖాతాదారులు బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రీజియన్ క్రెడిట్ చీఫ్ మేనేజర్, ఎంఎల్‌పీ హెడ్, లోకల్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్, బ్రాంచ్ హెడ్స్ పాల్గొన్నారు.

## కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా లింగం రవి

- తాడేపల్లి కాపు కార్పొరేషన్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం



లింగం రవితో ప్రమాణం చేయిస్తున్న చైర్మన్ అడపా శేషు. చిత్రంలో ఎండీ కృష్ణమూర్తి

**కాకినాడ రూరల్:** ఏపీ కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కాకినాడ రూరల్ నియోజకవర్గం రమణయ్యపేట శేషాద్రినగర్‌కు చెందిన సీనియర్ నేత లింగం రవి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని తాడేపల్లి వద్ద కాపు కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్ అడపా శేషు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ ఎండీ ఎస్.కృష్ణమూర్తి, డైరెక్టర్లు చీకట్ల కిశోర్, మద్దాల తిరుమలరావు, కాపు సంఘ నేత ముత్యాల పోసిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి సహకరించారన్నారు. కాపుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు. కాపు విద్యార్థులకు తోడ్పాటు అందించేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రమాణ స్వీకారం కోసం రాయుడుపాలెం నుంచి బుధవారం ఉదయం పది కార్లలో వివిధ వర్గాలకు చెందిన అనుచరులతో ఆయన విజయవాడకు వెళ్లారు. వీరిలో పి.పెదసత్యం, బీసీ నేత కొత్తపల్లి గిరీష్, తిరగాటి లక్ష్మి, డీవీకేవీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## జగనన్న కాలనీలో సర్వే పనుల పరిశీలన



గురజనాపల్లిలో సర్వే పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

**కరప:** గురజనాపల్లిలోని సాల్ట్ భూముల్లో ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీలో చదును చేసి, ముక్కురాళ్లు వేసే పనులను బుధవారం తహసీల్దార్ పి.శ్రీనివాసరావు పరిశీలించారు. నాలుగు రోజుల్లో పనులు పూర్తి చేయాలని సర్వే బృందానికి సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చొరవతో గురజనాపల్లి గ్రామానికి ఆనుకుని ఉన్న సాల్ట్ భూములు 11.52 ఎకరాలు కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకున్నట్టు పేర్కొన్నారు. లేఅవుట్‌ను చదునుచేసి, ప్లాట్లుగా విభజిస్తారన్నారు. వారం రోజుల్లో పనులు పూర్తిచేసి, 560 మంది లబ్దిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను ఎమ్మెల్యే కన్నబాబు అందజేస్తారన్నారని తెలిపారు. గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, ఆర్ఐ పేపకాయల మాచరావు, మండల సర్వేయర్ ఈ.రామకృష్ణ ఆయన వెంట ఉన్నారు.

## నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ప్రశాంతశ్రీ తదితరులు

**కాకినాడ రూరల్:** ఏడీబీ రోడ్డులో అచ్చంపేట జంక్షన్ వద్ద ఉన్న రెడ్ క్రాస్ అంధుల పాఠశాలలో బాలికలకు బుధవారం నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి పీజీ సెంటరు ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ బాలికలతో కొద్దిసేపు కాలక్షేపం చేశారు. అంధత్వం జయించాలని వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీదేవి, హరిబాబు, రాధా మాధవి, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ మద్యం స్వాధీనం

**కాకినాడ క్రైం:** అక్రమ మద్యాన్ని నగరానికి తెచ్చి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ ఏటిమొగలకు చెందిన రచ్చ నారాయణరావు అనే వ్యక్తి ఇంటి వద్ద మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నాడు. అతడి నుంచి 46 నిబ్‌లు, ఆరు బీరు బాటిళ్లను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

**బోట్‌క్లబ్:** హోప్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ, అలయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం స్థానిక దుమ్ములపేట, ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ చూపిన చిన్నారులకు సేవా సంస్థ అధ్యక్షులు లక్ష్మీ నాగేంద్ర బహుమతులు అందించారు. క్లబ్ గవర్నర్ మునిరెడ్డి, వైస్ గవర్నర్ వనుము శ్రీనివాస్ మాట్లాడారు. శివశక్తి మహిళా మండలి సభ్యురాలు అనిత గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించారు.

**తరాలను రక్షించడమే..**

అమ్మాయిని రక్షించడమంటే తరాలను రక్షించడమే అని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో కాకినాడ ఐడీఏ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. కాకినాడ ఐడీఏ అధ్యక్షుడు డా.నాగేంద్ర ఆధ్వర్యంలో బాలికలకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు.

**అన్ని రంగాల్లో ముందుండాలి**

కాకినాడ రూరల్: సమాజంలో కీలకమైన బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని సత్య స్కాన్-డయాగ్నోస్టిక్ చీఫ్ రేడియాలజిస్ట్ కాద వెంకటరమణ అన్నారు. నేమాం జెడ్పీ హైస్కూల్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం జరిగింది. హెచ్‌ఎం జి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కాకినాడ రూరల్ సీడీపీఓ వై.లక్ష్మి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు అల్లూరి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**బాలికలు సత్తా చాటాలి**

**కాకినాడ రూరల్:** అన్ని రంగాల్లో బాలికలు సత్తా చాటాలని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల భవిష్యత్తుకు చక్కని బాట వేయడంతో పాటు, వారిని సురక్షిత పౌరులుగా తీర్చిదిద్దడం ముఖ్యమన్నారు. సమాజంలో ఆడపిల్లలకు మంచి గుర్తింపు తీసుకువచ్చేలా పెద్దలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, కర్నాసుల సత్యనారాయణ పాల్గొన్నారు.